క్లుప్తంగా

బొల్లాపల్లి తహసీల్దార్‌గా సుధాకర్‌శర్మ



బొల్లాపల్లి: మండల తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా వి.సుధాకర్ శర్మ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన కలెక్టరేట్‌లో డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. పూర్తి అదనపు బాధ్యతలతో మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌శర్మ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై మండల ప్రజలు నేరుగా సంప్రదించాలని సూచించారు. రైతులు ఏమైనా సమస్యలు ఉంటే స్వయంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న షేక్ జాన్‌సైదా

చిలకలూరిపేట: ఏకాగ్రతతో చదివిన విద్యార్థులు పరీక్షలలో మంచి ఫలితాలు సాధిస్తారని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. బుధవారం మండలం కేంద్రమైన యడ్లపాడు గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో జాన్ సైదా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని జాన్ సైదా అన్నారు. జాన్ సైదా చేస్తున్న సేవా కార్యక్రమాలు నేటి సమాజంలో ఎంతో మందికి ఆదర్శమని పాఠశాల హెచ్‌ఎం పార్వతి అన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, బీవీ రెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకుడు షేక్ అబ్దుల్ రవూఫ్, కారచోల విజయభాస్కర్ రెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, కరిముల్లా, శ్రీకాంత్, మానుకొండ శేషిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ వీధులన్నీ శుభ్రం



నరసరావుపేట: పట్టణంలోని పలు ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణంలోని పారిశుద్ధ్యంపై ఆకస్మిక సందర్శన నిర్వహించిన విషయం విధితమే. ఆయన అధికారులతో కలిసి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ పలు రోడ్ల కూడళ్లలో చెత్త నిల్వుండటాన్ని గమనించి వెంటనే శుభ్రం చేయించాలంటూ మున్సిపల్ అధికారులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలను హెచ్చరించిన విషయం కూడా విధితమే. ఈ మేరకు పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి పేరుకుపోయన చెత్తను తొలగించటంతో వీధులన్నీ శుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీనిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లాన్ టెన్నీస్ పోటీలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల లాన్ టెన్నీస్ పోటీలను బుధవారం మ ద్దుకూరి పౌండేషన్ ఛైర్మన్ మద్దుకూరి అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప ల్నాడుజిల్లా కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, పోటీల పరిశీలకుడు కడియం జయరావు, స్టేడియం చీఫ్ కోచ్ చావల శ్రీనివాసరావు, కోచ్ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఫామ్ 9(2) నోటీసులు

శావల్యాపురం: రీసర్వే పనుల్లో భాగంగా భూములు విస్తీర్ణం కొలతలు పూర్తి చేసిన రైతులకు ఫామ్ 9(2) నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు తెలిపారు. బుధవారం శావల్యాపురం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించిన అనంతరం ఫామ్ 9(2) నోటీసులు రైతులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో గ్రామమైన శావల్యాపురంలో 700 మంది రైతులకు ఫామ్ 9(2) నోటీసులు రికార్డు పనులు పూర్తి అయినట్లు తెలిపారు. రీసర్వేలో భూములకు సంబంధించి నోటీసులు అందుకున్న రైతులు ఎమైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల వ్యవధిలో రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. డీటీ వేముల వెంకట నాగరాజు, డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కో-ఆర్డినేటరు బోడెపూడి శ్రీను, గ్రామ అధ్యక్షుడు దేవనబోయిన వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలోసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భోగ్ భాండార్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సేవాలాల్ దేవాలయానికి, కల్యాణమండపానికి భూమిని కేటాయించామని, రానున్న రోజుల్లో వారి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సుగాలీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి తండా అభివృద్ధి చెందిందని అన్నారు. ఆర్.కృష్ణానాయక్‌తో పాటు పార్టీ బొల్లాపల్లి మండలం నాయకులు పాల్గొన్నారు.

• ప్రభ నిలిచింది

నరసరావుపేట రూరల్: కోటప్పకొండకు తరలివెళ్లేందుకు గురవాయపాలెం విద్యుత్ ప్రభ సిద్ధమయింది. బుధవారం రాత్రి ప్రభను నిలబెట్టే క్రమంలో అదుపుతప్పి పక్కకు విరిగి పడింది. ఈ ఘటనలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. అర్ధరాత్రి నుంచి ప్రభను పునర్నిర్మించేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. గురువారం ప్రభ నిర్మాణం పూర్తికావడంతో రథంపై నిలబెట్టారు. ప్రమాదానికి గురైన ప్రభను నిర్వాహకులు ఎంతో శ్రమించి 24గంటల్లోనే తిరిగి నిలబెట్టారు. ఇందుకోసం మూడు భారీ క్రేన్‌లను ఉపయోగించారు. శుక్రవారం ప్రభను కొండకు తరలిస్తామని నిర్వాహకులు తెలిపారు.



రథంపై నిలబెట్టిన గురవాయపాలెం ప్రభ

• పుర ప్రభ కదిలింది

నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభ బుధవారం రాత్రి కోటప్పకొండకు బయలుదేరింది. తొలి ఏకాదశి పర్వదినంరోజున ప్రభను నిర్మించి త్రికోటేశ్వర స్వామి దర్శనంకోసం కొండకు తీసుకెళ్లటం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా పురపాలక సంఘం కార్యాలయం నుంచి అంగరంగ వైభవంగా విద్యుత్ కాంతులతో మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురపాలక సంఘం అధికారులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటప్పకొండకు వెళ్లేందుకు సిద్ధమైన పురపాలక ప్రభ

నిబంధనలు పాటిస్తేనే తిరునాళ్ల విజయవంతం

- భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- ఘాట్‌రోడ్డులో నడచివెళ్లేందుకు అనుమతిలేదు
- విలేకర్ల సమావేశంలో డీఎస్పీ విజయభాస్కరరావు

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులు, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందికలగకుండా, కొండ వద్ద ట్రాఫిక్ జామ్‌కాకుండా కొన్ని నిబంధనలు పాటించాలని డీఎస్పీ సి.విజయభాస్కరరావు కోరారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగ రోజున ఘాట్‌రోడ్డుగుండా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నడిచి వెళ్లేందుకు భక్తులకు అనుమతిలేదన్నారు. వారు మెట్ల మార్గంగుండానే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట పట్టణం నుంచి కొండకి వచ్చే ప్రభలు మధ్యాహ్నం 2గంటల నుంచి బయలుదేరి యల్లమంద, గురవాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 6గంటలకు ప్రభలు నిల్పునే ప్రాంతానికి చేరుకోవాలన్నారు.

- వీఐపీ పాస్ కలిగి నరసరావుపేట నుంచి కొండకు వచ్చే భక్తులు పెట్లూరివారిపాలెం మీదుగా ఘాట్‌రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన వీఐపీ పార్కింగ్‌లో తమ వాహనాలను పార్క్ చేసి ప్రభుత్వం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ భాస్కరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి

- చిలకలూరిపేట నుంచి పాస్‌లతో వచ్చే భక్తులు యూటీ సెంటర్ నుంచి క్రషర్స్ మార్గం గుండా వీఐపీ వెహికిల్ పార్కింగ్ చేరుకోవాలన్నారు. వీఐపీ పాస్‌లు కేవలం కొండపైకి చేరుకునేందుకే గాని ఉచిత దర్శనానికి పనికిరావని వెల్లడించారు.
- కొండ నుంచి తిరిగి వెళ్లే భక్తులలో నరసరావుపేటవైపునకు వెళ్లేవారు రెడ్ల సత్రం మీదుగా చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటుచేసిన రూట్‌లో మాత్రమే వెళ్లాలన్నారు. గురవాయపాలెం, యల్లమంద గ్రామాల మీదుగా వెళ్లేందుకు అనుమతిలేదన్నారు.
- వీఐపీ, జనరల్ పార్కింగ్ నుంచి తిరిగి వెళ్లేవారు కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల నుంచి జేఎన్‌టీయూ మీదుగా వినుకొండ-నరసరావుపేట హైవే రోడ్డుపైకి చేరుకోవాలన్నారు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వాహనాల ద్వారా వచ్చే భక్తులు మన్నెపల్లి నుంచి లక్ష్మీపురం, పెట్లూరివారిపాలెం మీదుగా ఘాట్‌రోడ్డు పక్కనే గల జనరల్ పార్కింగ్‌కు చేరుకోవాలన్నారు. ఇదే ప్రాంతాల నుంచి ప్రభల వద్దకు వచ్చే వారు మన్నెపల్లి, తంగేడుమల్లి, గురిజేపల్లి, యూటీ గ్రామాల మీదుగా ప్రభల నిధి చేరుకోవాలన్నారు.
- మన్నెపల్లి నుంచి కోటప్పకొండకు ట్రాఫిక్ అనుమతించమన్నారు. ఏఎంరెడ్డి కళాశాల ఎదురుగా గల పోలీసు చెక్‌పోస్టు నుంచి కొండవైపునకు ప్రైవేటు వాహనాలకు అనుమతిలేదన్నారు.
- చిలకలూరిపేట నుంచి ప్రభల వద్దకు వచ్చే ట్రాఫిక్ యడవల్లి నుంచి అట్లలఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న రోడ్డు గుండా కట్టుబడివారిపాలెం గ్రామం మీదుగా ప్రభలు నిల్పునే ప్రదేశానికి చేరుకోవాలన్నారు.
- కోటప్పకొండ నుంచి చిలకలూరిపేటవైపుకు వెళ్లే వారు యూటీ జంక్షన్ నుంచి కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల మీదుగా చెరువురోడ్డు గుండా చిలకలూరిపేటకు వెళ్లాలన్నారు. ఈ విధంగా భక్తుల సౌకర్యార్థం పోలీసులు ఏర్పాటుచేసిన ట్రాఫిక్ నియంత్రణ మార్గాలను పాటిస్తూ తిరునాళ్ల విజయవంతానికి సహకరించాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురవాయపాలెం నుంచి కొండకు వస్తున్న విద్యుత్‌ప్రభను సందర్శించారు. అనంతరం చిలకలూరిపేట మేజర్ కేనాల్ వద్ద చిన్మయ ఆశ్రమం వెనుకు నుంచి ఏర్పాటుచేస్తున్న రోడ్డును పరిశీలించారు. పమిడిమర్రు వద్ద ఆర్టీసీ బస్సుల కోసం నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కొండపైకి చేరుకుని క్యూలైన్‌లు, వీఐపీ దర్శనం ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం ప్రారంభించనున్న అన్నదాన మండపం, యాత్రికుల వసతిగదులను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వేమూరి గోపి, సర్పంచి వెన్నపూస నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మూరే రవీంద్రారెడ్డి, కనకాపుల్లారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మట్లా లింగారెడ్డి పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

గణపవరంలో నేషనల్ హైవే అధికారుల పరిశీలన

నాదెండ్ల: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై గణపవరం వద్ద ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ నెల 12వ తేదీన ఇసుక లోడుతో ఉన్న టిప్పర్ టీ దుకాణంలోకి దూసుకెళ్లగా ముగ్గురు గాయాలు కాగా మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసమైన విషయం విధితమే. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి పక్కన టీ దుకాణాలు, ఇతర దుకాణాలు ఉండటంతో సేద తీరేందుకు ఎక్కువ మంది వస్తుంటారు. ఈ క్రమంలో వాహనాలను జాతీయరహదారిపైనే నిలుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. 2018లో కలకత్తా నుంచి మంగుళూరు వెళ్తున్న కారు.. జాతీయ రహదారిపై తూర్పు వైపున నిలిపిన కంటెయినర్ లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృత్యువాతపడ్డారు. ఆ తర్వాత కొద్దిరోజులకే జాతీయ రహదారికి పడమర వైపున తెల్లవారుజామున టీ దుకాణంలోకి లారీ దూసుకెళ్లటంతో భార్యా, భర్తలతో పాటూ టీ తాగేందుకు వచ్చిన ఇరువురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ తరహా ప్రమాదాలు ఎన్నో చోటు చేసుకోవటంతో హైవే, పోలీసు, రెవెన్యూ, రోడ్డు రవాణా శాఖల అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. హైవే మార్జిన్‌లో ఆక్రమణల్లో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను పూర్తిగా తొలగించారు. అప్పటినుంచి కొన్నేళ్ల వరకూ దుకాణాలు పెట్టేందుకు ఎవరూ సాహసించలేదు. ఇటీవల కాలంలో తిరిగి హైవే మార్జిన్‌లో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో లారీలు, ఇతర వాహనాలు నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి హైవే మార్జిన్ ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించేందుకు ఉపక్రమించారు.

వడియరాజుల సత్రాలకు బియ్యం తరలింపు

వినుకొండ(నూజెండ్ల): మహాశివరాత్రి సందర్భంగా వినుకొండ నియోజకవర్గ వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం, త్రిపురాంతకం వడియరాజుల సత్రాలకు బియ్యంను బుధవారం తరలించారు. శ్రీశైలం సత్రానికి 30 క్వింటాళ్ల బియ్యం, రూ.35వేలు, త్రిపురాంతకం అన్నదాన సత్రానికి 13 క్వింటాళ్ల బియ్యాన్ని తరలించినట్లు సంఘపెద్దలు వివరించారు. గత 35 సంవత్సరాలుగా వడియరాజుల సంఘం ద్వారా శ్రీశైలం శక్తిపీఠమైన భ్రమరాంబ జ్యోతిర్లింగం మల్లికార్జునస్వామి మహాశివరాత్రికి బియ్యం తరలిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన సత్రం ప్రచార కార్యకర్త బండారు వెంకటకోటయ్య, బత్తుల వెంకటస్వామి, బత్తుల పిచ్చయ్య, తురక ఏడుకొండలు, ఉప్పు ఏడుకొండలు, బండారు వెంకటేశ్వర్లు, పల్లపు వెంకటేశ్వర్లు, వేముల కోటినారాయణ, ఇర్ల హరిబాబు, ఇర్ల గురవయ్య, బత్తుల కోటేశ్వరప్ప, దుర్గారావు పాల్గొన్నారు.



వినుకొండ నుంచి మినీలారీలో బియ్యం తరలిస్తున్న వడియరాజుల సంఘం సభ్యులు

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

వినుకొండ(నూజెండ్ల): మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్ బుధవారం తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సాధారణ చార్జీలతో స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. శ్రీశైలంకు 14 బస్సులు, కోటప్పకొండకు 35, త్రిపురాంతకంకు 6 బస్సులు, మన్నేపల్లి క్షేత్రానికి 2 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులు కాసేందుకు వెళ్లి విగతజీవిగా..

యడ్లపాడు: సాగర్ కాలువలో దిగి ప్రమాదవశాత్తు వ్యక్తి చనిపోయిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యడ్లపాడు గ్రామానికి చెందిన రాచమంటి గంగయ్య(53) రోజు మాదిరిగానే మంగళవారం మధ్యాహ్నం పశువులతో ఊరి బయట పొలాల్లో మేపుకునేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఇరుగుపొరుగు వారికి విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గంగయ్య కోసం తలోదిక్కున వెతుకులాట ప్రారంభించారు. బుధవారం ఉదయం పీబీసీ కాలువ గట్టుపై గంగయ్యకు చెందిన చెప్పులు, కర్ర కనిపించడంతో అనుమానంగా కాలువ పొడవున గమనించారు. కారుచోల వెళ్లే మార్గంలోని కాలువ సప్టాతూములో ఇరుక్కుని గంగయ్య శవమై తేలియాడుతూ తూము వద్ద కనిపించాడు. వెంటనే యడ్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పైడి రాంబాబు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం వేళ పశువులు శుభ్రం చేసేందుకు కాలువలోకి దిగి పొరపాటున కాలుజారి నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించగా గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. గంగయ్యకు భార్య తిరుమల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



గంగయ్య మృతదేహం

నమ్మించి బంగారు ఆభరణాలు చోరీ

శావల్యాపురం: నమ్మించి, ఓ మహిళనుంచి మూడు సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన మండలంలోని వేల్పూరులో బుధవారం జరిగింది. ఎస్ఐ గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు మేరకు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న పొలంలో గుత్తా మంగమ్మ గడ్డి కోసుకొని ఇంటికి వెళుతుండగా ఈక్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బైకుపై వచ్చి మీ తమ్ముడు మల్లయ్య గడ్డిమూటతో పాటు నిన్ను బైకుపై ఎక్కించుకొని రమ్మన్నాడు అంటూ నమ్మించి మరలా పొలానికి తీసుకొని వచ్చాడు. ఈనేపథ్యంలో గుత్తా మంగమ్మ వంగి గడ్డిమూట కడుతున్న సమయంలో మెడలో ఉన్న టువంటి రెండున్నర సవర్ల విలువైన బంగారు నాన్‌తాడు, అర సవరి విలువైన ఆభరణాలు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి

అచ్చంపేట: లంబాడ, బంజారాల దైవ స్వరూపులు సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన ప్రజావేదిక అధ్యక్షుడు బాణావతు రామకోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ తత్వ పరిజ్ఞానంతో అనేక గిరిజన తండాలు సంచరిస్తూ ఆనాటి అనాగరిక సమాజంలో బంజారా లంబాడాలకు నాగరికత నేర్పినట్లు చెప్పారు. మద్యం, మాంసాహారం భుజించరాదని, శాంతి యుత జీవనం గడపాలని, అహింస భక్తి మార్గంలో జీవించాలని బోధనలు చేసిన మహనీయులు సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాడువాయి సర్పంచ్ భూక్యా మంత్రియ నాయక్, మాదిపాడు ఎంపీటీసీ భూక్యా రమేష్ నాయక్, నీలేశ్వరపాలెం సర్పంచ్ కోటేశ్వరరావు నాయక్, హనుమా నాయక్, కొండలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవాల అంకురార్పణ

సత్తెనపల్లి: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అంకురార్పణ చేపట్టారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, రక్షాబంధనం, అఖండ స్థాపన, గోపూజ, దీక్ష స్వీకరణ, కైలాస మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్య వేక్షించారు.

రైతుల మేలు కోసమే సమగ్ర భూ రీసర్వే

ఈపూరు: జగనన్న సమగ్ర భూసర్వే పథకాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని తహసీల్దార్ రమావత్ వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కొలిచేటప్పుడు రైతులు తప్పనిసరిగా ఉండి హద్దులను చూపించాలని అన్నారు. తద్వారా భూవివాదాలకు తావు ఉండదని తెలిపారు. 1920 తరువాత నేటి వరకు భూసర్వే జరగలేదని, ఇందుకోసం ప్రభుత్వం రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తుందని, రైతు యొక్క భూమి కొలిచి వారి హద్దుల్లో రాళ్లు వేసేందుకు కూడా ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందన్నారు. కోర్టులో ఉన్న వివాదాల మినహా సాధ్యమైనంతవరకు అన్ని భూములను ఈ రీసర్వేలో కొలిచి సర్వే బృందం హద్దులు నిర్ణయిస్తుందని, రైతుకు రైతుకు మధ్య వివాదం ఉన్నా 99శాతం వరకు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు శాయశక్తులు కృషిచేస్తారని, పరిష్కారం కాని పక్షంలో ఆ భూములను కూడా పెండింగ్‌లో ఉంచుతామన్నారు. ఈపూరు మండలంలో వనికుంట గ్రామంలో సర్వే పూర్తయిందని, అధికారికంగా జగనన్న భూహక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. మిగతా గ్రామాల్లో కూడా రీసర్వే జరుగుతుందని, వాటిని కూడా త్వరలో పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తామన్నారు. కనుక ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్ కోరారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించి భూసర్వే, వెబ్‌ల్యాండ్ తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఏ భాస్కర్, మండల సర్వేయర్ చండీరాణి, డీటీ రాజశేఖరనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొండ్రముట్ల గ్రామంలో సర్వే పనులను పరిశీలించి సూచనలు ఇస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్

శావల్యాపురంలో...

శావల్యాపురం: రీసర్వే పనులు పురోగతిలో రైతులు తమ వంతు సహకారం అందించాలని తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు అన్నారు. బుధవారం మండలంలోని పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో 3550 ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 1500 ఎకరాలు భూముల కొలతలు సరిహద్దులను రైతుల సమక్షంలో ఆధునీకరణ రోవర్ యంత్ర పరికరాలు ద్వారా నమోదు చేశామన్నారు. సర్పంచ్ తిరివిధి శివకుమారి, ఆర్ఐ బాబు, సచివాలయ సర్వేయరు గురుబ్రహ్మం, వీఆర్ఓ అమల, తదితరులు ఉన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

నకరికల్లు: రెవెన్యూ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం ముఖ ఆధారిత హాజరు వేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పనిచేసి ఈ-క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వేకి సంబంధించి భూయజమానుల నుంచి హక్కుపత్రాలు, ఫోన్ నంబర్లు సేకరించి కార్యాలయంలో అందజేయాలన్నారు. బీఎల్వోల వద్ద పెండింగ్‌లో ఉన్న 6బీ దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వ్యవసాయ గణన ద్వారా భూ కమతాల వివరాలను అగ్రి సెన్సెస్ దరఖాస్తులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలి

సత్తెనపల్లి: పన్నులు చెల్లించి పట్టణాబివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 2022-23 సంవత్సరానికి చెల్లించవలసిన గృహ, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, ఆక్రమణ పన్నులు, ప్రకటన చార్జీలు నిర్దేశించిన సమయంలోగా చెల్లించాలని స్పష్టం చేశారు.

సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాలి

చిలకలూరిపేట: దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుసవాలుగా మారిన గౌతమ్ అదానీ వ్యవహారాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీ ద్వారా విచారణ నిర్వహించాలని అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకులు కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అదానీ ఆర్థిక కుంభకోణం- దేశ ఆర్థిక వ్యవస్థకు విసిరిన పెను సవాలు అనే అంశంపై అఖిల పక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానులుగా ఉన్న కాలంలో ఆరోపణలు వచ్చినప్పుడు పార్లమెంటరీ కమిటీ విచారణకు ఆదేశించిన విషయం గుర్తు పెట్టుకొని వారి మార్గంలో ప్రధాని మోదీ నడవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైర రామసుబ్బాయమ్మ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపు కోటేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాలకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలి

రాజుపాలెం: రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాల తొలగింపునకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దార్ ఎ.నళిని కోరారు. కొండమోడు-పేరేచర్ల రోడ్డు జాతీయ రహదారిగా విస్తరిస్తున్న సందర్భంగా స్థానిక అంకమ్మతల్లి, ఆంజనేయస్వామి దేవాలయాలు తొలగింపుపై స్థానిక గ్రామపెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డువిస్తరణలో భాగంగా సదరు ఆలయాలు తొలగించాల్సి వస్తుందన్నారు. రెండు దేవాలయాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఆర్బీకే సలహా మండలి చైర్మన్ కేదారి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సకినాల వలిరాజు, చొక్కా గాలయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.